లేదు సుధాకర్. చిన్న వయసులోనే తండ్రితో పాటు తల్లిని కోల్పోయారన్న సానుభూతితో చేతనైనంత వరకూ బాధలు తెలియకుండా పెంచుకొస్తున్నాడు. ఇంటర్ పూర్తికాగానే శాంతికి పెళ్ళిచేసి పంపించేయాలని అనుకుంటు న్నాడు కూడా! ప్రభాకర్ పదోతరగతి చదువు తున్నాడు.

ఇప్పుడు వదినొస్తే తననింక చదువుకో నివ్వదేమో, చదువు మానడం తనకిష్టంలేదు. పెద్ద పెద్ద చదువులు చదువుకోవాలి. ఆలోచ నలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభాకర్‌కి చట్టు క్కున ఓ ఆలోచన వచ్చింది.

"అయ్యా! మీ కోసమెవరో వచ్చారు" అటెం డరు రామయ్య క్లాసు మధ్యలో వచ్చి చెప్పాడు. తనకోసం వచ్చేవాళ్ళెవరబ్బా అనుకుని, ఇప్పుడే వచ్చేస్తాను అల్లరి చేయకండని పిల్లలకు చెప్పి బయటకు నడిచాడు సుధాకర్. గేటు దగ్గర నిలబడిన ఆదిశేషయ్యగార్ని చూసి ఆశ్చర్య పోయాడు. "మీరా. ఏమిటిలా వచ్చారు?" ఆశ్చ ర్యంగా అడిగాడాయన్ని. వారం క్రితం తనకి పిల్లనిస్తానంటూ వచ్చాడాయన. తనకిప్పుడా ఆలోచనలేదనీ, నిదానంగాఆలోచించి ఏసంగతీ ఉత్తరం రాస్తాననీ, చెప్పాడు సుధాకర్....మరి మళ్ళీ వచ్చాడెందుకు? అర్థం కాలేదు సుధాకర్‌కి.

ఆయనేం మాట్లాడకుండా జేబులోంచి ఓ ఉత్తరం తీసి ఇచ్చాడు. ఆ ఉత్తరం విప్పి చూశాడు సుధాకర్. అందులో ప్రభాకర్ చేతి వ్రాతని సులభంగానే గుర్తించాడు. అతడి కళ్ళు గబగబా ఆ వాక్యాలవెంట పరుగెత్తాయి.

ఉత్తరం చదవడం ముగించిన సుధాకర్ ముఖం కందగడ్డలా ఎర్రగా మారిపోయింది. అప్పటికప్పుడు ప్రభాకర్ని పట్టుకుని నాలుగు తన్నాలనిపించింది. తలెత్తి చూసిన సుధాకర్‌కి దూరంగా గేటుదాటుతున్న ముసలాయన కన్పిం చాడు.

సాయంకాలం స్కూలునుండి ఇంటి కెళ్తూనే, "ప్రభా, ఒరే ప్రభా, ఎక్కడ చచ్చావ్ త్వరగా రా" అని గావుకేకలు పెట్టాడు. 'ఏంటన్నయ్యా?' అంటూ శాంత, ప్రభాకర్ చెరో వైపూ పరు గెత్తుకొచ్చారు. వాళ్ళ బుద్ధి తెలిసింది మొదలు సుధాకర్ అంతగట్టిగా అరవడం ఎప్పుడూ గమనించలేదు.

"ఇలారా" కుర్చీలో కూర్చుంటూ పిలిచాడు ప్రభాకార్ వైపుచూసి. అయోమయంగా చూస్తూ దగ్గరగా వచ్చాడు ప్రభాకర్. జేబులో నుండి ఉత్తరంతీసి "ఏమిటిది?" అడిగాడు. కోపాన్ని కంఠంలో కన్పించకుండా జాగ్రత్త పడ్డాడు.

ప్రభాకర్‌కి సంగతేమిటో అర్థమైపోయింది, తను ఆదిశేషయ్యకి రాసిన ఉత్తరమది. అన్నయ్య చేతికేలా వచ్చిందో. బెరుగ్గాచూపి తల దించు కున్నాడు. "ఎందుకు వ్రాశావిలా? నాకు సమా ధానంకావాలి!" ఖచ్చితంగా అడిగాడుసుధాకర్.

"నువ్వు మంచివాడివి కాదనిచెప్తే నీకు వాళ్ళు అమ్మాయిని ఇవ్వరు కదా! అందుకని అలా వ్రాశాను". తల వంచుకుని చెప్పాడు ప్రభాకర్.

"వదిన వస్తే నన్నూ, శాంతక్కయ్యనీ బయటికి తరిమేస్తుందిగా" బావురు మన్నాడు ప్రభాకర్ అన్నయ్యని పట్టుకుని.

"ఎందుకు తరిమేస్తుందమ్మా" అనునయంగా వీపు నిమిరాడు సుధాకర్.

మరి మా ఫ్రెండ్ భాస్కర్‌గాడి వదిన అలాగే చేసిందిగా! అందరి వదినలూ అలానే చేస్తారుట. మా శీను కూడా చెప్పాడు

ఆమాటలు వినగానే మనసంతా జాలితో నిండిపోయింది సుధాకర్‌కి. "ఎవరో వదినొచ్చి చెబితే నేను మిమ్మల్ని తరిమేస్తానని ఎలా అనుకుంటావోయ్ పిచ్చి నాగన్నా! నన్ను చూస్తే అలా అన్పిస్తోందామీకు? మొదట శాంతకి పెళ్ళి చేయాలి. అంతేకాదు తమ్ముడూ! నీ పెళ్ళయితేనేకాని, నేను కూడా పెళ్ళిచేసుకోను సరేనా." అన్నాడు సుధాకర్.

"నిజంగానా మా అన్నయ్య ఎంత మంచి వాడోచ్" అంటూ పసిపిల్లాడిలా సంతోషపడి పోతోన్న ప్రభాకర్ని చూసి మనస్ఫూర్తిగా నవ్వు కున్నాడు సుధాకర్.

**—డి. ప్రభావతి**
**(తిరుపతి)**

**స్రవంతి నెం: 9లో ఇచ్చినవాక్యం**
**"తమ్ముడూ నీ పెళ్ళయితేనే కాని నేను చేసుకోనురా" అన్నాడు సుధాకర్.**
**ఆధారంగా రాసిన కథలు**

# సోదర ప్రేమ

"అబ్బా!" నిస్సత్తువగా కుర్చీలో కూల బడ్డాడు సుధాకర్. డాక్టర్ రిపోర్ట్ వల్ల తెలుసుకున్న చేదునిజం, అతని మనసులో పదే పదే మెదలుతోంది. నిజంగా అలాగే జరిగితే, అమ్మో! ఇంకేమన్నా వుందా? అలా జరగ టానికి ఎంతమాత్రం వీలులేదు.

"ఎందుకన్నయ్యా, పిలిచావట"? అడిగాడు రత్నాకర్, అతనికమనసులో భయంగానే ఉంది. నిన్నతనూ, సంధ్యా, పార్కులో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకోటం, అన్నయ్య కళ్ళబడింది. అన్నయ్య చీవాట్లేస్తాడేమోనని భయపడుతూ నిల్చున్నాడు.

ఏం సమాధానం చెప్పాలో తెలియక తల దించుకున్నాడు రత్నాకర్. "చూడు రత్నా! నాన్నగారు లేరుగాబట్టి, ఈ కుటుంబం పెద్దగా, నేను చెప్పినదాన్ని నువ్వు ఆదరించితీరాలి"

"అన్నయ్యా!" సంధ్యతో తన స్నేహాన్ని ఎడబాపుకోమంటాడేమోనని బాధపడుతూఅన్నాడు.

"అవునురా, తనకు కోడలు వస్తే, విశ్రాంతి తీసుకోవాలని అమ్మ ఆశపడుతున్నది. రేపు ఒకసారి ఆ అమ్మాయిని ఇంటికి తీసుకురా. అమ్మ ఓ.కె. అంటే మిగిలినవి నేను చూసు కుంటాను". రత్నాకర్‌కి ఆనందంతో ఎగిరి గంతెయ్యాలనిపించింది. అయినా ఇదేమిటి, అన్నయ్య తన పెళ్ళిమాట ఎత్తుకోకుండా, మా పెళ్ళి జరిపిస్తానంటున్నాడు?

"నువ్వు మాపెళ్ళికి ఒప్పుకున్నందుకే చాలా సంతోషం అన్నయ్యా! అయినా, నీగురించి ఏమీ చెప్పకుండా, మా పెళ్ళికి తొందర పడుతున్నా వేంటి? కొత్త పెళ్ళికూతురు హోదాలో అడుగు పెట్టే సంధ్యకు హారితిచ్చి, ఆప్యాయంగా లోప లకు తీసుకువెళ్ళవలసినది, సీతమ్మలాంటి మా వదినకదా! ఇన్నాళ్ళూ ఎలాఅడగాలో తెలియక వూరుకున్నాను. వదినను నువ్వు ముందే సెలెక్టు చేసుకుని, మమ్మల్ని సర్‌ప్రైజ్ చేద్దామని చూస్తూన్నావుకదూ! ఇంకెందుకన్నయ్యా దాగుడు మూతలు. లైన్ క్లియరిచ్చేయ్. మేం కూడా హాయిగా పెళ్ళి చేసుకుంటాం!" నవ్వుతూ అన్నాడు రత్నాకర్.

"తమ్ముడూ! నీపెళ్ళయితేగాని నేను చేసు కోనురా" నెమ్మదిగా అన్నాడు సుధాకర్. రత్నాకర్ ఆశ్చర్యపోతూ," అదేమిటన్నయ్యా! ముందు మా పెళ్ళి జరగటానికి నేనెలా ఒప్పు కుంటాననుకున్నావు? నువ్వు ఎందుకు చేసుకో నంటున్నావో కారణం చెప్పి తీరాలి" పట్టు పట్టాడు. "వేరే కారణం ఏముందిరా? నువ్వు, సంధ్య చనువుగా వుంటున్నారు. అదివేరే అన ర్థానికి దారితీయకుండ, మీ ఇద్దరి పెళ్ళి జరి పించేద్దామని, నేనింకా పెళ్ళికూతుర్ని వెతికోవ వాలి. అమ్మకు నచ్చాలి. ఈ తతంగంమంతా వుంది కదా. ఏమంటావు?" అన్నాడు. సుధా కర్ ప్రతిపాదనను అయిష్టంగానే ఒప్పుకున్నాడు రత్నాకర్.

'అమ్మయ్య! ఈ రెండురోజుల నుండి నేను పడ్డటెన్షన్ ఇప్పుడు తగ్గింది. ఇంక నా జీవితం ఏమైన ఫరవాలేదు.

ఓ కేన్సర్ మహమ్మారీ! మా రత్నా పెళ్ళి జరిగే వరకూ విజృంభించకు. తరువాత నేనే నీకు లొంగిపోతాను". బాధగా అనుకున్నాడు, కేన్సర్ వ్యాధికిగురై, ఇంక కొద్ది నెలల్లోనే తనకు మృత్యువు తప్పదని తెలుసుకున్న సుధాకర్.

**—సి. రాదికా కృష్ణ**
**(భీమవరం)**

**ఓ కథ రాయండి**

ఈ క్రింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథని రాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారి తోషికం పంపబడుతుంది.

"విడాకులే ముందు... పెళ్ళి తర్వాత" ఖచ్చితంగా చెప్పాడు సుధీర్.